# సిపిఐ(ఎం)కు ఓటెయ్యండి

## వామపక్షాల్ని బలపర్చండి

# దళితుల సమానత్వం కోసం గౌరవం కోసం

16వ లోక్‌సభ ఎన్నికల ప్రచార కరపత్రం 2014

## కులవ్యవస్థకు వ్యతిరేకంగా..

మన దేశంలో దళితులు వ్యవసాయ కార్మికులలో అత్యధికులుగానూ, అసంఘటిత రంగ శ్రామికులలో గణనీయమైన భాగంగానూ వున్నారు. ఆర్థిక వ్యవస్థా, సమాజమూ సజీవంగా వుండాలంటే వారి శ్రమ అత్యావశ్యకము. ఇటువంటి ముఖ్యమైన పాత్రను నిర్వహిస్తున్నప్పటికీ సమాజంలో అట్టడుగున పడివున్న అణగారిన తరగతులుగానే వారున్నారు. యుపిఏ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నయా ఉదారవాద విధానాలు వారి దుస్థితిని మరింత దారుణంగా మార్చాయి.

## ఎస్సీల ఉద్యోగాలపై ప్రైవేటీకరణ ప్రభావం

ప్రభుత్వరంగ సంస్థల మూసివేత, ప్రైవేటీకరణ పెరుగుదల కారణంగా రిజర్వేషన్ అనే పదానికి స్థానం లేని పరిస్థితి చోటుచేసుకున్నది. ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లను ప్రవేశ పెట్టాలన్న దీర్ఘకాల డిమాండును యుపిఏ ప్రభుత్వం నెరవేర్చలేదు. ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లను ప్రవేశ పెడతామని గత ఎన్నికల వేళ కాంగ్రెసు పార్టీ వాగ్దానం చేసింది, కాని, కార్పొరేట్ రంగం ఆదేశాలకు లోబడి తన వాగ్దానాన్ని నెరవేర్చటంలో అది విఫలమైంది.

ఇదే సమయంలో ప్రభుత్వానికి చెందిన వివిధ విభాగాలలో ఖాళీగా వున్న స్థానాలను భర్తీ చేయకుండా యుపిఏ ప్రభుత్వం అనాసక్తినే ప్రదర్శించింది. సిబ్బంది, ఇబ్బందుల నివారణ, ఫించను మంత్రిత్వ శాఖకు ప్రధాన మంత్రే స్వయంగా నేతృత్వం వహిస్తున్నప్పటికీ ఎస్సీ, ఎస్టీ, ఓబిసీలకు ఉద్దేశించిన వుద్యోగ ఖాళీల్లో భర్తీ చేసినది కేవలం 30 శాతానికి లోపు మాత్రమే. వివిధ మంత్రిత్వ శాఖల్లోనూ, విభాగాల్లోనూ, ప్రభుత్వ రంగంలోనూ భర్తీ కాకుండా మిగిలిపోయిన ఖాళీలు 76,137 కాగా, వీటిల్లో కేవలం 26,472 ఖాళీలను మాత్రమే నింపటం జరిగింది. అంటే, ప్రతి మూడు ఖాళీలకు

ఒక దానిని మాత్రమే నింపారు. ఖాళీలను నింపలేదంటే దానర్థం అర్హత గలిగిన వారు లేకపోవటంగా ఎంతమాత్రం అర్థం చేసుకోరాదు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే వివిధ తరహాల వారిలో నిరుద్యోగం పెరుగుతున్నదని తెలుస్తున్నది.

## నానాటికీ పెరుగుతున్న భూమిలేని నిరుపేదలు

దళితుల సామాజిక స్థితిగతులు యిప్పటికీ భయానకంగానే కొనసాగుతున్నాయి. దళితుల్లో అత్యధికులు వృత్తిపరంగా భూమిపైనే ఆధారపడి వున్నప్పటికీ అతి కొద్దిమందికి మాత్రమే భూవసతి వున్నది. స్వంత భూములున్న కొద్దిమంది కూడా చిన్న సన్నకారు రైతులే, వారు కూడా తమ భూమిని కోల్పోతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీలలో భూములను పోగొట్టుకుంటున్న వారి సంఖ్య పెరుగుతున్నది, అలా పోగొట్టుకున్నవారు వ్యవసాయ కార్మికులుగా మారుతున్నారు. అన్ని తరగతులకన్నా ఎస్సీలే వ్యవసాయ కార్మికులుగా అధిక సంఖ్యలో వున్నారు.

తమ స్వంత భూమిని సాగు చేసుకుంటూ, జనాభా లెక్కల్లో 'వ్యవసాయదారులు'గా నమోదైన ఎస్సీల సంఖ్య 2001లో 20 శాతం వుండగా 2011 నాటికి 14.8 శాతానికి తగ్గింది. భూ యాజమాన్యంలో వీరి సంఖ్య త్వరితగతిని తగ్గిపోయింది. దళితుల చేతుల్లో కొద్దిపాటిగా వున్న మడి చెక్కలు కూడా వాళ్ళ చేతుల్లో నుంచి ఎలా వెళ్ళిపోయిందీ దీనిని చూస్తే తెలియగలదు, దీనంతటికీ ప్రభుత్వం చేపట్టిన విధానాలే కారణం. సాగు వ్యయం పెరిగిన తరుణంలో ప్రభుత్వ సహాయం కొరవడటంతో దళితులు వ్యవసాయం నుండి గెంటివేతకు గురవుతున్నారు. వ్యవసాయదారులుగా వున్న దళితులకు కాంగ్రెసు ప్రభుత్వం మద్దతు యివ్వకపోగా, దళితుల ప్రయోజనాలకు వుద్దేశించిన 22 పథకాలను ఉపసంహరించుకున్నది. దళితులపట్లా, వారికి సాధికారికతను సమకూర్చటం పట్లా ఆ పార్టీకి అంత చిత్తశుద్ధి వున్నదన్నమాట!

## పెరుగుతున్న తొలగింపులు

ఆందోళన కలిగించే మరో అంశం వున్నది. 'ప్రధాన శ్రామికులు" అంటూ ఎవరినైతే జనాభా లెక్కలు పేర్కొంటున్నాయో, అంటే, ఆరు మాసాలకు పైబడి పనిచేస్తున్న వారన్నమాట, వీరి సంఖ్య ఎస్సీలలో తగ్గుతున్నది –2001లో వీరు73 శాతం వుండగా 2011 నాటికి 70.7 శాతానికి తగ్గింది.

ఇదేవిధంగా మొత్తం శ్రామిక శక్తిలో తొలగింపులు మరింత ఎక్కువగా వున్నాయి. ఎస్సీలలో యీ తొలగింపులు 2001లో 27 శాతం వుండగా 2011లో 29.3 శాతం వున్నది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ స్త్రీల భాగస్వామ్య పాత్ర 2001 నాటికి 28.3 శాతంగా వున్నది.

కొన్ని కుటుంబాలు తాము నడుపుతున్న చిన్న తరహా, కుటీర పరిశ్రమలను మూసివేసి ప్రధాన శ్రామిక శక్తిలో చేరుతున్నట్లు జనాభా లెక్కల వివరాలు తెలుపుతున్నాయి. ఎస్సీలలో 'కుటీర పరిశ్రమ శ్రామికులు' 2001లో 3.9 శాతం వుండగా, 2011 నాటికి 3.2 శాతానికి తగ్గిపోయారు. దీనినిబట్టి ఎస్సీలు నడిపే పరిశ్రమలకు రుణాలను మంజూరు చేయటంలోగానీ, మార్కెట్ సౌకర్యాలను కల్పించటంలోగానీ ప్రభుత్వం నుంచి మద్దతు కొరవడినట్లు అర్థం అవుతున్నది. దళితులైన దరఖాస్తుదారులకు రుణాల మంజూరుకు వ్యతిరేకంగా  అలిఖిత ఆదేశాలు కొనసాగుతున్నట్లున్నది. 2012లో రిజర్వు బ్యాంకు వెల్లడించిన వివరాల ప్రకారం దళిత పారిశ్రామికులకు నగదు పంపిణీ 33.8 శాతం తగ్గింది. ఈ ధోరణికి అడ్డుకట్ట వేసేటందుకు కాంగ్రెసు నేతృత్వంలోని యుపిఏ ప్రభుత్వం చేసిందేమీ లేదు.

## చదివే హక్కులేదా?

దళితులు, అత్యంత దారుణమైన ఆర్థిక దోపిడీకి, సామాజిక అణచివేతకూ గురవుతున్నారు. చివరకు, రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్లు అమలవుతున్న విద్యారంగంలో సైతం సర్వసాధారణంగా వ్యక్తమయ్యే అభిప్రాయానికి భిన్నంగా దళితులు ప్రయోజనాన్ని పొందటం లేదు. ప్రాథమిక దశలో బడిమానే దళిత పిల్లల సంఖ్య సమాజంలోని యితర తరగతులకు చెందిన పిల్లలకన్నా చాలా ఎక్కువగా వున్నది. చట్టం ప్రకారం దళితులకు 15 శాతం సీట్లను కేటాయించాలి, కాని, ఉన్నత విద్యలో వారి ప్రవేశం 10 శాతం మాత్రమే వున్నది. అధికుడు నిచ్చెన పైకి చేరితే వివక్షత అధికంగానే వుంటుంది! ఐఐటి, ఏఐఐఎంఎస్ వంటి ప్రధానమైన సంస్థలలో దళితులు 10 శాతంకన్నా

తక్కువగానే వున్నారు, అంటే, దళితుల కోసం రిజర్వయిన ప్రతి మూడు సీట్లలో ఒకటి ఖాళీగా వుంటున్నది. మరీ దుర్మార్గమైన విషయం ఏమిటంటే దళిత విద్యార్థుల స్కాలర్‌షిప్పుల నిమిత్తం కేటాయించిన మొత్తాలను కాంగ్రెసు ప్రభుత్వం నిరంతరం తగ్గిస్తూ వుండటం. ఈ ఏడాది సైతం, కేటాయించిన మొత్తంకన్నా బడ్జెట్‌లో రూ. 400 కోట్ల తగ్గుదల వున్నది.

## ప్రత్యేక అనుసంధాన ప్రణాళికా లేక దారితప్పించే ప్రత్యేక ప్రణాళికా?

మానవాభివృద్ధికి చెందిన అనేక అంశాలలో దళితులు కనీస ప్రమాణాలకు సైతం దూరంగానే వుండిపోయారు. అనేక వాగ్దానాలు చేసినప్పటికీ, పలు పథకాలను ప్రకటించినప్పటికీ దళితులకు పెద్దగా ఒరిగిందేమీ లేదు, వాగ్దానాలను సరైన రీతిలో అమలు చేయలేదు. దళితుల జీవిత పరిస్థితులపై గణనీయమైన ప్రభావాన్ని చూపగలిగిన ఒక పథకాన్ని, అంటే, షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికను (ప్రత్యేక అనుసంధాన ప్రణాళిక) పరిశీలించుదాము.

ప్రత్యేక అనుసంధాన ప్రణాళికను అనుసరించి కేంద్ర బడ్జెట్‌లో ప్రణాళికా వ్యయం దళితుల సంఖ్య ప్రకారం వుండాలి, కాని, యీ నియమాన్ని యుపిఏ ప్రభుత్వం ఘోరంగా వుల్లంఘించింది. పై నియమాన్ని పాటించి వున్నట్లయితే 2014-15 బడ్జెట్‌లో దళితులకోసం 16.6 శాతాన్ని కేటాయించాలి, కాని, 8.76 శాతాన్ని మాత్రమే కేటాయించటం జరిగింది. అంటే, యివ్వాల్సిన దాంట్లో సగమన్న మాట. 2014-15 బడ్జెట్ మొత్తం రూ. 17,63,214 కోట్లు. ఎస్‌సిఎస్‌పి కింద కేటాయించ వలసినది రూ. 92,183.45 కోట్లు, కాని, వాస్తవంలో కేటాయించినది మాత్రం రూ. 48,638.31 కోట్లు. అంటే యివ్వాల్సిన దానిలో సుమారుగా సగమన్న మాట. కేటాయించిన మొత్తం కూడా దళితుల సంక్షేమం కోసం ఖర్చు చేయటం లేదని అనుభవం తెలియ చెప్తున్నది. గత ఏడాది (2013-14) కేటాయించినది రూ. 41,561.13 కోట్లుకాగా, సవరించిన అంచనాల ప్రకారం ఖర్చు చేసినది మాత్రం రూ. 35.800.6 కోట్లు మాత్రమే. దళితుల సంక్షేమం పట్ల యుపిఏ ప్రభుత్వ వైఖరి ఏమిటో యీ అంశం సుస్పష్టంగా తెలియ చేస్తున్నది.

## మొత్తం ప్రణాళిక-ప్రణాళికేతర బడ్జెట్ వివరాలు

| వివరము | 2012-13 (ఏఇ) | 2013-14 (బిఇ) | 2013-14 (ఆర్ఇ) | 2014-15 (బిఇ) |
|---|---|---|---|---|
| మొత్తం బడ్జెట్ | 14,10,367 | 16,65,297 | 15,90,434 | 17,63,214 |
| ప్రణాళికా బడ్జెట్ | 4,13,625 | 5,55,322 | 4,75,532 | 5,55,322 |
| ప్రణాళికేతర బడ్జెట్ | 9,96,742 | 11,09,975 | 11,14,902 | 12,07,892 |

## ఎస్‌సిఎస్‌పి కింద షెడ్యూల్డ్ కులాలకు చేసిన కేటాయింపుల వివరాలు

| | | | | |
|---|---|---|---|---|
| ఎస్‌సిపి కింద కేటాయింపులు | 28,218.81 | 41,561.13 | 35,800.6 | 48,638.31 |
| ఎస్‌సిపి శాతం | 6.82 | 7.48 | 7.53 | 8.76 |
| ఉండవలసినశాతం | 16.60 | 16.60 | 16.60 | 16.60 |
| ఉండవలసిన ఎస్‌సిపి | 68,661.75 | 92,183.45 | 78,938.31 | 92,183.45 |
| ఎస్‌సిపి నిరాకరణ | 40,442.94 | 50,622.32 | 43,137.71 | 43,545.14 |

ఆదేశిత నిధులు దళితులకు కేటాయించి, వ్యయం చేసేటందుకుగాను ఒక శాసనాన్ని చేయటంద్వారా ఎస్‌సిఎస్‌పికి చట్టబద్ధతను కల్పించాలని మార్క్సిస్టు పార్టీ డిమాండు చేసింది. కాని దీనికి చట్టబద్ధతను కల్పించే శాసనాన్ని తేవటంలో యుపిఏ ప్రభుత్వం విఫలమైంది.

తొలుత సిపిఎం, తదనంతర కాలంలో సారూప్యత కలిగిన సంఘాలు చేసిన పోరాట ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్టరూపాన్ని యిచ్చింది.

## బహుముఖ వివక్షత

దళితులకు ప్రాథమిక సౌకర్యాలను, గౌరవప్రదమైన జీవన పరిస్థితులను కల్పించటంలో ఎంతో వివక్షత వుంటున్నది. మురికి వాడల్లో నివసిస్తున్న కుటుంబాల గురించి 2013 సెప్టెంబరు 30వ తేదీన రిజిష్టార్ జనరల్ మరియు, భారత జనభా గణాంక కమిషనర్ కార్యాలయం ఒక నివేదికను విడుదల చేసింది. దాని ప్రకారం, షెడ్యూల్డ్ కులాల (ఎస్సీలు) వారిలో ఎక్కువ భాగం మురికి వాడల్లోనే నివసిస్తున్నారు. మురికి వాడల్లో నివసించే ప్రతి ఐదుగురులో ఒకరు ఎస్సీ కాగా, యితరులు ప్రతి 10మందిలో ఒకరున్నారు. గత దశాబ్దిలో మురికి వాడల్లోని ఎస్సీల దామాషా పెరిగింది. 1956 నాటి మురికివాడల అభివృద్ధి–మెరుగుదల చట్టం మురికివాడలను యీ విధంగా నిర్వచించింది. శిధిల స్థితిలో వుండి, జనసమ్మర్ధం కలిగివుండి, లోపభూయిష్టమైన ఏర్పాట్లతోనూ, నమూనాలతోనూ కూడిన కాంక్రీటు నిర్మాణాలు, ఇరుకైన వీధులు, గాలి వెలుతురు సరిగా లేకపోవటం, పారిశుధ్య కొరత వంటివాటితో కూడుకుని జనుల రక్షణకూ, ఆరోగ్యానికీ ప్రమాదాన్ని కలిగించే నివాస ప్రాంతాలను మురికి వాడలని పిలుస్తారు.

దళితులకు ప్రాథమిక సౌకర్యాలను అందించటంలో ప్రభుత్వం ఏమేరకు వివక్షతను పాటిస్తున్నదీ యీ దిగువ పట్టిక చూస్తే తెలుస్తుంది.

**దళితులకు, యితర సామాజిక తరగతులకు మధ్య**

**అభివృద్ధి సూచికల్లో వున్న తారతమ్యాలు**

| సూచికలు | ఎస్సీలు | అన్ని బృందాలు |
|---|---|---|
| అక్షరాస్యత (శాతంలో) | 63.5 | 72 |
| మహిళల్లో పౌష్టికాహార లోపం (బిఎంఐ18.5శాతం కన్నా తక్కువ) | 41.2 | 33 |
| బరువు తక్కువ పిల్లలు (శాతంలో) | 47.9 | 39.1 |
| పక్కా ఇళ్ళు (శాతంలో) | 38.3 | 66.1 |
| మరుగు దొడ్లు లేనివారు (శాతంలో) | 65 | 49.2 |
| విద్యుత్ సౌకర్యం (శాతంలో) | 61.2 | 75 |
| శిశుమరణాలు (ప్రతి 1000 జననాలకు) | 66.4 | 50 |
| ఐదేళ్ళలోపు పిల్లల్లో మరణాల రేటు | 88.1 | 74.3 |
| ఐదేళ్ళలోపు పిల్లల్లో వ్యాధి నిరోధిక శక్తి లోపించినవారు | 39.7 | 43.5 |
| దారిద్ర్యం (గ్రామీణ ప్రాంతం) | 20.6 | 14.9 |
| దారిద్ర్యం (పట్టణ ప్రాంతం) | 25.3 | 14.5 |

**ఆధారం : ఇండియా– మానవాభివృద్ధి నివేదిక 2011.**

## దళితులపై సాగుతున్న దౌర్జన్యాలు

ఆర్థిక వివక్షత, ప్రాథమిక సౌకర్యాల నిరాకరణతో పాటుగా క్రూరము, అమానవీయమూ అయిన సామాజిక అణచివేతకు కూడా గురవుతున్నారు. దళితులపట్ల క్రూరకృత్యాలు అంతకంతకూ పెరిగి పోతున్నాయి. మిర్చపూర్, ధర్మపురి, ఖైర్లాంజిలతోపాటు, ఉత్తరప్రదేశ్, హర్యానా తదితర రాష్ట్రాలలోని అనేక గ్రామాలలో

దళితులపై సాగుతున్న దౌర్జన్యాలను గమనిస్తే యీనాటికీ దళితులు ఎంతటి దుస్థితిని ఎదుర్కొంటున్నదీ అర్థం కాగలదు. లజ్జాకరమైన యీ ధోరణికి దేశ రాజధాని ఢిల్లీ సైతం మినహాయింపు కాదు. ఇటీవల వివాహ సందర్భంగా దళితుడైన పెండ్లి కుమారుడు గుర్రంపై వూరేగడాన్ని అనుమతించ లేదు.

చివరకు ఢిల్లీలోని అఖిల భారత వైద్యవిజ్ఞాన సంస్థ (ఏఐఐఎంఎస్) సైతం కుల వివక్షతకు పాల్పడుతున్నది, దళిత విద్యార్థులను వేధించటం, కొన్ని సబ్జక్టులలో ఉత్తీర్ణులను చేయక పోవడం, ప్రత్యేక వసతి గృహాల్లో వుండేలా బలవంత పెట్టడం జరుగుతున్నది. దారుణమైన మరో విషయమేమంటే, దళిత అధ్యాపకుల పోస్టులు ఖాళీగా పడివున్నాయి. ఈ దుస్థితి ఒక్క ఏఐఐఎంఎస్‌లోనే కాకుండా ఐఐటి వంటివాటిల్లో కూడా నెలకొని వున్నది. ఏఐఐఎంఎస్‌లో వున్న కుల వివక్షతపై విచారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ పరిశీలనలో యీ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదవుతున్న కేసులు దేశవ్యాప్తంగా పెరుగుతున్నాయి. నేర నమోదు విభాగం వివరాల ప్రకారం 2010లో 10,513 కేసులు నమోదు కాగా, 2011లో 11,342, 2012లో 12,576 కేసులు నమోదయ్యాయి.

దళితులపై దౌర్జన్యాలు పెరగటం, శిక్షల రేటు తగ్గుదల చూస్తుంటే, యీ చట్టంలోని లోపాలను సరిదిద్దాలని, మారుతున్న నేర రూపాలను కూడా యీ చట్టంలో చేర్చాలని అర్థమవుతున్నది. పదేపదే నిరసనలు వెల్లువెత్తుతున్నప్పటికీ యుపిఏ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వుండి పోతున్నది, యీ చట్టాన్ని పటిష్టం చేయటానికి ఎలాంటి సవరణలను తీసుకు రావటం లేదు.

ఎఫ్ఐఆర్‌ను దాఖలు చేయటానికి దళితులు ఎన్నో యిబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఒకవేళ కేసులను నమోదు చేసినప్పటికీ శిక్షలు పడుతున్న ఉదంతాలు 3 నుంచి 8 శాతం వరకు మాత్రమే వుంటున్నాయి. దాదాపుగా 80 నుంచి 90 శాతం అపరిష్కృతంగా వుండిపోతున్నాయి. 21 మంది దళితుల మరణాలకు దారితీసిన బథని తోలా మారణకాండ కేసులో సరైన సాక్ష్యాధారాలు లేవంటూ నిందితులను విడచి పెడ్తూ యిచ్చిన 2012 నాటి తీర్పు సందర్భంగా పార్లమెంటులో సంబంధిత మంత్రి ప్రకటన చేస్తూ యీ వాస్తవాన్నే ధ్రువీకరించారు.

ఇది చాలదన్నట్లుగా దళితులపై దౌర్జన్యాల నిరోధానికిగాను చేసే కేటాయింపులను యుపిఏ ప్రభుత్వం తగ్గించింది.

## మోడీ దృష్టిలో పారిశుధ్య పని అనేది 'ఆధ్యాత్మికమైనది'

హిందూత్వ ప్రయోగశాల అయిన గుజరాత్‌లో దళితుల పరిస్థితి మరింత భీతావహంగా వుంది. పారిశుధ్య పని అనేది దళితులకు 'ఆధ్యాత్మిక అనుభవాన్ని' ప్రసాదించే వృత్తి అని బిజెపీ ప్రధాన మంత్రి అభ్యర్థి నరేంద్ర మోడి నమ్ముతాడు. ఆయన యిలా చెప్తాడు: "కేవలం జీవనోపాధి కోసమే వారీ పని చేస్తున్నారంటే నేను నమ్మను. అదే నిజమైతే తరతరాలుగా వారీ పనిని కొనసాగించరు.......యావత్సమాజమూ, దేవతలు సంతృప్తి పొందటం కోసం యీ పని చేయటం తమ విధియన్న జ్ఞానోదయం ఒకానొక తరుణంలో తప్పనిసరిగా కొంతమందికి కలిగి వుంటుంది; దేవతలు తమపై వుంచిన యీ కార్యాన్ని వారు నెరవేరుస్తున్నారు; పరిశుభ్రం చేయడమనే యీ కార్యం శతాబ్దాలుగా అంతర్గత ఆధ్యాత్మిక కర్మగా కొనసాగుతున్నది". ఆవిధంగా యిది జ్ఞానపూరితమైన ఆధ్యాత్మిక కర్మ అన్న మాట! ఇటువంటి అద్భుత భావాలు కలిగిన ప్రతిపాదకుడు తాను చెప్పింది ఎందుకు ఆచరించడో! ఇటువంటి వ్యక్తికి, ఆయన పార్టీయైన బిజెపీకి అధికారాన్ని అప్పచెప్పితే దళితులు, అలానే సమాజంలోని యితర అణగారిన తరగతులకు చెందిన వారు అభివృద్ధి చెందగలరా? ఎంతమాత్రం అభివృద్ధి వుండదు, పైగా దిగజారటం వుంటుంది.

2011 జనాభా లెక్కల ప్రకారం గుజరాత్‌లో దాదాపు 2,000 కుటుంబాలు విధిలేక పారిశుధ్య పనిని చేస్తున్నాయి. టాటా సామాజిక శాస్త్రాల సంస్థ చేసిన మరో సర్వే ప్రకారం గుజరాత్‌లో 12,000 మంది పారిశుధ్య కార్మికులు వున్నట్లు తెలుస్తున్నది. గుజరాత్‌లో అత్యధికంగా దళితులు వుండే సౌరాష్ట్రలో 900 కుటుంబాలు పారిశుధ్య పనిలో తమ శ్రమను వెచ్చిస్తున్నాయి.

బిజెపీ పాలిత 'ఆదర్శ రాష్ట్రమైన' గుజరాత్‌లో కుల వివక్షత అడ్డూ ఆపు లేకుండా సాగుతున్నది. ఇటీవలి కాలానికి చెందిన కొన్ని ఘటనలను చూద్దాము:

2011లో నిర్వహించిన ఒక సర్వేలో గుజరాత్‌లోని 12 గ్రామాలకు చెందిన దళిత, దళితేతర పిల్లలను ఇంటర్వ్యూ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ, దవాఖానాల్లోనూ చికిత్స కోసం వెళ్ళినపుడు వివక్షతను ఎదుర్కొంటున్నట్లు 90 శాతం దళిత బాలబాలికలు చెప్పారు. ప్రాథమికమైన రోగనిదాన పరీక్షల సందర్భంగా వివక్షతను ఎదుర్కొంటున్నట్లు 80 శాతంమంది తెలిపారు.

జాతీయ మానవహక్కుల కమీషన్ అధ్యక్షుడు విడుదల చేసిన ప్రకటన ప్రకారం సామాజిక బహిష్కరణల కారణంగా గుజరాత్‌లో కనీసం 77 గ్రామాలకు చెందిన దళితులు విధిలేక వలసలు పోవలసి వస్తున్నది. పోలీసుల వేధింపులకు సంబంధించి దాదాపు 100 వరకు ఫిర్యాదులు కమిషన్‌కు అందినట్లు ఆయన తెలిపారు. అంతేకాక, పోలీసులు, దళితుల ఫిర్యాదులను స్వీకరించటం లేదు, ఒకవేళ తీసుకున్నప్పటికీ వాటిపై ఎలాంటి చర్యలూ వుండటం లేదు.

గుజరాత్‌లో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల చట్టం కింద నిందితులుగా వున్నవారిలో కేవలం 3.5 శాతం మందికి మాత్రమే శిక్షలు పడుతున్నాయి.

అహ్మదాబాద్ జిల్లాలో వున్న గల్సానా అనే గ్రామంలో (నగరానికి సుమారుగా 100 కి.మీ దూరంలో వున్నది) ఐదు దేవాలయాలు వున్నప్పటికీ ఏ ఒక్క దానిలోకి దళితులకు ప్రవేశం లేదు. కొంతమంది దళిత యువకులు యీ నిషేధాన్ని వ్యతిరేకించే సాహసం చేశారు. అందుకుగాను వారు సామాజిక వెలికి గురయ్యారు. కాని, ప్రభుత్వం మాత్రం దళితుల పక్షాన జోక్యం చేసుకోలేదు.

థాన్‌గర్హ్‌లో దళితులను దారుణంగా ఊచకోత కోసినపుడు (2012 సెప్టెంబరు) గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం వారి రక్షణకు ముందుకు రాలేదు. దాడులు జరిగే ప్రమాదం వున్నదని దళితులు ఫిర్యాదు చేసినప్పనటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించు కోలేదు.

దళితులకు సంబంధించిన అంశాలను లేవనెత్తటంతోపాటు కులవివక్షతకూ, దళితులపై సాగుతున్న దౌర్జన్యాలకూ వ్యతిరేకంగా నికరమైన పోరాటాన్ని చేస్తున్న ఒకేఒక్క రాజకీయ పార్టీ, మార్క్సిస్టు పార్టీ.

ధర్మపురిలో కుల ప్రాతిపదికపై దహన కాండ సాగినపుడు దళితులకు చెందిన కోట్లాది రూపాయల ఆస్తి బూడిదైంది. బాధిత కుటుంబాలకు న్యాయం చేకూర్చేటందుకై మార్క్సిస్టు పార్టీ, తమిళనాడు అస్పృశ్యతా నిరోధక సంఘటన (టిఎన్‌యుఇఎఫ్) కలసి ఉద్యమించాయి.

మార్క్సిస్టు పార్టీ, టిఎన్‌యుఇఎఫ్‌లు సంయుక్తంగా సాగించిన పోరాటాల కారణంగా ఉథపురంలో అస్పృశ్యతా గోడ కుప్పకూలింది.

ఇదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో మార్క్సిస్టు పార్టీ, కెవిపిఎస్‌లు సాగించిన పోరాటాల ఫలితంగా షెడ్యూల్డ్ కులాల, తెగల ఉప ప్రణాళికకు చట్టబద్ధత సమకూరింది. గ్రామాలలోని ఉమ్మడి బావుల వద్దకు, యితర నీటి వనరుల వద్దకు దళితులను రానీయక పోవటం, కొన్ని వీధుల్లోకి ప్రవేశాన్ని నిరోధించటం, శ్మశాన వాటికలను

వినియోగించుకోనివ్వక పోవటం, హోటళ్ళలో రెండు గ్లాసుల పద్ధతి, దేవాలయ ప్రవేశంపై నిషేధం వంటివాటికి వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగాయి. మార్క్సిస్టు పార్టీ దళితుల తరపున నిలచి, సాంఘిక వెలికి దళితులు గురైనపుడు జోక్యం చేసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది.

పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాలలో మార్క్సిస్టు పార్టీ నేతృత్వంలోని వామపక్ష సంఘటన ప్రభుత్వాలు అమలు చేసిన భూసంస్కరణల ఫలితంగా దళితులు ఎంతగానో ప్రయోజనాన్ని పొందారు. వామపక్ష ప్రభుత్వాలు వుండటం, అలానే వామపక్ష ఉద్యమాల బలంవలన యీ రాష్ట్రాలలో కుల వ్యవస్థకు దృఢమైన వ్యతిరేకత వ్యక్తమైంది, కనుకనే యితర రాష్ట్రాలలో వలె కుల వివక్షత, దళితులపై దౌర్జన్యాలు యిక్కడ కనిపించవు. కాగా, యిప్పుడు పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెసు ప్రభుత్వం వుండటంతో, ఒకప్పటి భూస్వాములంతా ఏకమై పేదలకు, ప్రత్యేకించి దళితులకు పంపిణీ చేసిన తమ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ తరహా ప్రయత్నాలను ప్రతిఘటించటంలో మార్క్సిస్టు పార్టీ ముందుపీఠిని వున్నది.

దళితుల స్థితిగతులలో మార్పు కోసమూ, వారి సాధికారికత కోసము, భీతిగొల్పే కులవ్యవస్థకు వ్యతిరేకంగా శక్తివంతమైన పోరాటం నడిపేటందుకుగాను, సిపిఎంనూ, అదేవిధంగా అన్ని రకాల కుల వివక్షతలకూ, అణచివేతలకూ వ్యతిరేకంగా సాగే పోరాటాలను బలోపేతం చేయాలి.

## కుల వ్యవస్థకు వ్యతిరేకంగా
## దళితుల సమానత్వ, గౌరవాల కోసం
## సిపిఎంకు ఓటివ్వండి, వామపక్షాలను బలపరచండి.

**వెల : ₹ 2/-** **ప్రతులు : 10,000**

ప్రచురణ కర్త :

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తరపున
జె. జయరాం, హౌస్ నెం. 1-1-60/2, యం.బి.భవన్,
ఆర్‌టిసి క్రాస్ రోడ్స్, ముషీరాబాదు, హైదరాబాద్ -20